క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన మాలే శ్రీనివాసరెడ్డి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాలే శ్రీనివాసరెడ్డి

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ ఐటీ వింగ్ మద్దిపాడు ప్రెసిడెంట్ మాలే శ్రీనివాసరెడ్డి తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. యువనేతల సమావేశం సందర్భంగా కలిసి పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

పంటలకు సేంద్రియ ఎరువులే శ్రేయస్కరం



రైతులకు సేంద్రియ ఎరువుల ప్రయోజనాలను వివరిస్తున్న ఏఓ

చీమకుర్తి రూరల్: ప్రధాన పంటల్లో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడటం వలన తెగుళ్లు రావని, అధిక దిగుబడి వస్తుందని మండల వ్యవసాయాధికారి డీవీ భాస్కర్ అన్నారు. మండలంలోని ఇలపావులూరు, గాడిపర్తివారిపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ మొక్కజొన్న, కంది, వరి పంటల్లో పాటించాల్సిన పద్ధతుల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా భక్తి సంగీత భజన కార్యక్రమాలు



భక్తి సంగీతంలో గాయకులు

ఒంగోలు మెట్రో: స్థానిక సత్యనారాయణపురం రామాలయంవారివీధిలో శ్రీ అనంత కోదండ రామస్వామి దేవస్థానంలో బుధవారం సాయంత్రం సంగీత సాహిత్య సంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలిండియా కళా రంగం పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి ఆధ్వర్యంలో డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వహణలో శ్రీ రామాంజనేయ భక్త సమాజం వారిచే సంగీత భజన కార్యక్రమాలు నిర్వహించారు. గాయకులు డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ, బాపట్ల రేఖ, ఈదుల చిన్నికృష్ణ సంగీత భక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి కోశాధికారి చల్లా బాలకొండయ్య, అనంత కోదండరామస్వామి కమిటీ అధ్యక్షుడు వేమూరి శ్రీనివాసరావు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

- ఫెడరలిజాన్ని కాపాడుకునేందుకు రాజ్యాంగ శక్తులు ఏకం కావాలి
- కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయ శక్తులు ఐక్యం కావాలి
- మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ఒంగోలు సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 9వ తేదీ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసేందుకు విశాలమద్దతును కూడగట్టాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక యూటీఎఫ్ భవన్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్గాల సదస్సు నిర్వహించారు. ఎల్ఐసీ యూనియన్ నాయకుడు పారా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో లక్ష్మణరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో ప్రభుత్వ రంగం దేశాభివృద్ధికి పునాదిగా సాగిందన్నారు. ప్రభుత్వ రంగం ద్వారా ప్రజలకు కావాల్సిన పునాదిని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. ఈ కారణంగానే 1970 కాలంలో ఒక్క హైదరాబాద్ నగరంలోనే 50 రకాల ప్రభుత్వ పరిశ్రమలు ఏర్పడినట్లు తెలిపారు. 1990 ఆర్థిక సంస్కరణల అమలులో భాగంగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వాలు ప్రైవేటీకరణ చేస్తున్నట్లు ఆరోపించారు. ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు పేరుతో 32 మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును సైతం ప్రైవేటీకరించేందుకు కేంద్రం యోచిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో అధికార పక్షంలోని టీడీపీ, జనసేన ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తామని ప్రకటించలేక పోతున్నట్లు విమర్శించారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన విశాఖ ఉక్కుకు సొంతగనులు కేటాయించకుండా ప్రైవేట్ కంపెనీలకు ధారాదత్తం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం యోచిస్తోందని ఆరోపించారు. ఉక్కు పరిశ్రమ కారణంగా విశాఖపట్నం అభివృద్ధి చెందిన అంశాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు అందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాల వల్ల కనీస వేతనం పనిగంటలు గ్రాట్యూటీ వంటి ప్రయోజనాలు సాధించుకోగా, ఆ చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ల అమలుకు కేంద్ర ప్రభుత్వం వ్యూహం పన్నుతుందన్నారు. ఈ లేబర్ కోడ్లు అమలు చేస్తే ఉద్యోగులు, కార్మికుల భవిష్యత్తు అంధకారం కానుందన్నారు. లేబర్ కోడ్స్ వ్యతిరేకంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక విశాల మద్దతు కూడగట్టి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల హామీ మేరకు 12వ పీఆర్సీని సీఎం చంద్రబాబు నియమించాలని, 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలని లక్ష్మణరావు డిమాండ్ చేశారు. మిర్చి, పొగాకు, శనగ వంటి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. రైతుల సమస్యలకు ఉద్యోగ, కార్మికులు అండగా నిలవాలని సూచించారు. రాష్ట్రాల హక్కులపై కేంద్రం చేస్తున్న దాడులను ఈ సందర్భంగా ఖండించారు. బీజేపీ యేతర రాష్ట్రాల్లో ఫెడరలిజాన్ని దెబ్బతీస్తూ కేంద్రం చేస్తున్న చర్యలను ఆయన తప్పుపట్టారు. గత 30 ఏళ్లుగా ఆర్థిక సంస్కరణలతో ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరణ చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న చేపట్టబోయే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసేందుకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక విశాల ఐక్యతను కూడగట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సదస్సులో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏవీ పుల్లారావు, మెడికల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లూరు వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు, బీఎస్ఎన్ఎల్ యూనియన్ నాయకుడు బాబూరావు, సీఐటీయూ నగర అధ్యక్షుడు టి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఆధార్ కార్డు కలిగి ఉండాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఇబ్రహీం షరీఫ్



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఇబ్రహీం షరీఫ్

ఒంగోలు: ప్రభుత్వం అందించే పథకాలు పొందే లబ్ధిదారులు ప్రతిఒక్కరూ ఆధార్‌కార్డు కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. స్థానిక సంతపేటలోని ఆధార్ నమోదు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఆధార్‌కార్డు లేని వారికి ప్రత్యేకంగా ఆధార్‌కార్డులో నమోదయ్యేలా సాతి కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీలో న్యాయవాదులు, న్యాయ సేవా సహాయకులతో కమిటీ ఏర్పాటు చేశామని, ఈ అవకాశాన్ని ఆధార్ కార్డు లేని నిరుపేద బాలలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి డి.దినేష్, న్యాయవాదులు నూకతోటి రవి కుమార్, ఎ.రామసుబ్బయ్య, బచ్చు రాజేష్, వి.గ్రేస్‌కుమారి, న్యాయ సేవా సహాయకులు పి.సతీష్, పి.శ్రీనివాసరావు, ఎస్.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దామచర్ల విఫలం

- సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు

ఒంగోలు టౌన్: ఏడాది కాలంలో ప్రచార ఆర్భాటాలు తప్ప హామీలు నెరవేర్చడంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పూర్తిగా వైఫల్యం చెందారని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అమృత పథకం ద్వారా వచ్చిన నిధులు తప్ప రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక గ్రాంట్లను దామచర్ల తీసుకురాలేకపోయారన్నారు. తాము అధికారంలోకి వస్తే ప్రతిరోజూ రక్షిత మంచినీరు సరఫరా చేస్తామని ఎన్నికలలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ ఏడాది కాలంలో నగర ప్రజలకు క్రమం తప్పకుండా మంచినీరు ఇవ్వలేకపోయారన్నారు. గతంలో మూడు రోజులకోసారి క్రమం తప్పకుండా నీరు సరఫరా చేసేవారని, ఇప్పుడు మూడు రోజులకోసారి కూడా నీళ్లు ఇవ్వలేకపోతున్నారని అన్నారు. ఏరోజు నీళ్లిస్తారో, ఏ టైంలో నీళ్లిస్తారో తెలియక జనం పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. కార్పొరేషన్ సరఫరా చేస్తున్న నీరు కలుషితం కావడంతో దుర్వాసన వస్తోందని, దీంతో నగర ప్రజలు అంటువ్యాధులతో అల్లాడుతున్నారని తెలిపారు. తాగడానికి గుక్కెడు మంచినీళ్లివ్వలేని ఎమ్మెల్యే.. ఒంగోలు ప్రజల దాహార్తిని తీర్చే శాశ్వత మంచినీటి పథకాలకు అవసరమైన 450 కోట్ల రూపాయల నిధులను రాష్ట్ర ప్రభుత్వం నుంచి తీసుకురాలేకపోతున్నారని విమర్శించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఒంగోలు నగరంలోని ఇళ్లు లేని నిరుపేదల కోసం 250 ఎకరాలు కొనుగోలు చేసి 20,800 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి సెంటు చొప్పున ఇంటి స్థలాలు పంపిణీ చేస్తూ డాక్యుమెంట్లు ఇచ్చిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లబ్ధిదారుల్లో 13 వేల మంది అనర్హులు ఉన్నారని తేల్చిందన్నారు. మిగిలిన వారికి ఎన్నికలలో హామీ ఇచ్చిన ప్రకారం ఒక్కొక్కరికి 2 సెంట్ల చొప్పున ఇంటి స్థలాలు పంపిణీ చేయాల్సి ఉండగా అనవసరంగా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. టిడ్కో ఇళ్లను పూర్తి చేసి ఇస్తానన్న హామీని కూడా అటకెక్కించారని ఆరోపించారు. పోతురాజు కాలువ ఆధునికీకరణ పనులను అర్ధంతరంగా ఆపేశారని, అండర్ డ్రైనేజీ పనుల నిర్వహణలో ఒక్క అడుగు కూడా పడలేదని అన్నారు. కూటమి ఏడాది పాలనలో ఆర్భాటాలు తప్ప అభివృద్ధి శూన్యమని విమర్శించారు. ఒంగోలు నగర అభివృద్ధి కోసం 1000 కోట్ల రూపాయలు అవసరమవుతాయని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులను రాబట్టాలని డిమాండ్ చేశారు.

ఆశా వర్కర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

ముండ్లమూరు (దర్శి): జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి ఆదేశాల మేరకు మండలంలోని పులిపాడు, శింగన్నపాలెం గ్రామాల్లో ఆశా కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ముండ్లమూరు వైద్యాధికారి మల్లెల జాస్మిన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విలేజ్ హెల్త్ శానిటేషన్ న్యూట్రీషన్ కమిటీ తీర్మానం ప్రకారం దరఖాస్తులను జిల్లా వైద్యారోగ్య శాఖాధికారికి పంపడం జరుగుతుందన్నారు. పదో తరగతి పూర్తి చేసి చదవడం, రాయడం వచ్చిన 25 నుంచి 45 ఏళ్లలోపు వివాహితలు అర్హులని తెలిపారు.

కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి



కౌలు రైతులకు కౌలు కార్డుల గురించి వివరిస్తున్న ఏవో కిషోర్‌బాబు

కొత్తపట్నం: కౌలుకు పొలం తీసుకునే రైతులు కౌలు కార్డులకు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.కిషోర్‌బాబు సూచించారు. మండలంలోని గమ్మళ్లపాలెం, వజ్జిరెడ్డిపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి కిషోర్‌బాబు మాట్లాడుతూ కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులను సంప్రదించి కార్డులు తీసుకోవాలని కోరారు. అలాగే రసాయనిక మందుల వాడకం తగ్గించాలని, ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించాలని, ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగుచేయాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ నరసింహులు మాట్లాడుతూ ప్రీమూన్ డ్రై సోయింగ్ నవధాన్యాల కిట్ గురించి వివరించారు. ఇందులో 22 రకాల విత్తనాలు ఉంటాయని, 10 కేజీల కిట్‌ను రూ.650కి అందించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భర్త బి.నారాయణ, ఏఈవో అజయ్ కుమార్, వీఏఏ కె.రవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేష్, అమృత, జహిదా, రైతులు పాల్గొన్నారు.

భవిత సెంటర్ ఆకస్మిక తనిఖీ

కొత్తపట్నం: కొత్తపట్నం-1 స్కూల్లో ఉన్న భవిత సెంటర్‌ను బుధవారం సర్వశిక్ష అభియాన్ కో ఆర్డినేటర్ పి.నాగేంద్ర నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భవిత సెంటర్‌లో 14 మంది విద్యార్థులు హాజరైనట్లు వారు తెలిపారు. వారిలో విద్యా ప్రగతిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. టీఎల్ఎం ద్వారా విద్యాబుద్ధులు నేర్పించాలని సూచించారు. ఫిజియోథెరపీ ద్వారా అందిస్తున్న సేవలను మండలంలోని వికలాంగుల తల్లిదండ్రులకు తెలియజేయాలని కోరారు. ప్రతి బుధవారం ఫిజియోథెరపీ జరుగుతుందని, అందరూ శ్రద్ధతో అవలంబించాలని సూచించారు. ప్రతిరోజూ భవిత సెంటర్‌కు హాజరుకావాలని కోరారు. వారికి కావాల్సిన అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో టి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



కొత్తపట్నంలో భవిత సెంటర్‌ను తనిఖీ చేస్తున్న నాగేంద్ర నాయక్

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణ



శ్రీగిరిలో హనుమాన్ చాలీసా పారాయణలో పాల్గొన్న మహిళలు



శ్రీగిరిలో ఊంజల సేవలో శ్రీవారు

ఒంగోలు మెట్రో: స్థానిక శ్రీగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీగిరి క్షేత్రపాలకుడు అభయాంజనేయస్వామి ఆగమన ఆరాధన ఉత్సవాలను బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఆలయ అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో అభయాంజనేయస్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణలో మహిళలు సామూహికంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం శ్రీవారి ఊంజల సేవ కార్యక్రమాన్ని శోభాయమానంగా నిర్వహించారు. శ్రీగిరి దేవస్థానం ఆస్థాన సంగీత విద్వాంసుడు వీవీఎస్ వినోద్‌కుమార్ అన్నమయ్య సంకీర్తనలతో భక్తులను అలరించారు. శ్రీగిరి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, అర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలాదేవి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారితో పాటు ఆలూరు జై శంకర్ తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. శ్రీగిరి నిర్వాహకులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అభయాంజనేయస్వామి వారి ఆగమన ఆరాధన ఉత్సవాలలో భాగంగా గురువారం ఉదయం హనుమద్ యాగం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం ఏడు గంటలకు విష్ణు సహస్రనామ పారాయణ జరుగుతుంది. భక్తులు పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు కోరారు.

పారిశుధ్యంపై కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో జ్యోతి, ఈవోపీఆర్డీ రఘుబాబు

మద్దిపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్యంపై గ్రామ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో వి.జ్యోతి సూచించారు. బుధవారం సాయంత్రం కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. పీఆర్ వన్ యాప్లో ప్రతిరోజూ కార్యదర్శులు వివరాలు నమోదు చేయాలని సూచించారు. గ్రామాల్లో డంపింగ్ యార్డులు ఉన్నప్పటికీ బోర్లు పనిచేయకపోయినా అవి ఏ పరిస్థితుల్లో ఉన్నాయనే వివరాలు, గ్రామాల్లో అంతర్గత రోడ్ల పరిస్థితులపై సమాచారం సేకరించాలని తెలిపారు. ఈవోపీఆర్డీ రఘుబాబు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యాన్ని ఉన్నతాధికారులు ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్నారని, ప్రతి కార్యదర్శి గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, సంబంధిత యాపుల్లో కార్యక్రమాల వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏకేయూ వీసీని కలిసిన వీఎస్‌యూ వీసీ



వీఎస్‌యూ వీసీ శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఏకేయూ వీసీ మూర్తి, ప్రొఫెసర్లు

ఒంగోలు సిటీ: ఇటీవల విక్రమ సింహపురి యూనివర్సిటీకి రెగ్యులర్ ప్రాతిపదికన ఉప కులపతిగా నియమితులైన ప్రకాశం జిల్లా కొమరోలు నివాసి ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు బుధవారం స్థానిక ఆంధ్రకేసరి యూనివర్సిటీలో ఉప కులపతి ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తిని కలిశారు. ఏకేయూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.రాజమోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.నిర్మలామణి, సీడీసీ డీన్ ప్రొఫెసర్ జి.సోమశేఖర, సీఈ డాక్టర్ కేవీఎస్ రాజు, సోషల్ వర్క్ డిపార్టుమెంట్ హెడ్ డాక్టర్ పిల్లి వెంకటరావు, యూజీ విభాగం ఏసీటీఈ డాక్టర్ నక్కల సురేష్ తదితరులు విక్రమ సింహపురి వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఏకేయూ వీసీ ప్రొఫెసర్ మూర్తి ఆధ్వర్యంలో ఏకేయూ ప్రొఫెసర్లు శాలువా కప్పి అల్లం శ్రీనివాసరావును సన్మానించారు.

ఏకేయూ వీసీని కలిసిన నూకసాని బాలాజీ...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ బుధవారం స్థానిక ఆంధ్రకేసరి యూనివర్సిటీలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తిని కలిశారు. వీసీకి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపి పలు విషయాలపై చర్చించారు.

హంస వాహనంపై ఆంజనేయుడు



హంస వాహనంపై ఆంజనేయస్వామి



పూజలలో పాల్గొన్న మహిళా భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక పప్పుబజార్లోని సీతారామస్వామి దేవస్థానంలో వార్షిక కళ్యాణోత్సవంలో భాగంగా బుధవారం ఉదయం ఆలయ అర్చకులు సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీరామ బాలభక్త సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాత్రికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఒంటె రథంపై శ్రీ ఆంజనేయస్వామికి నగరోత్సవం జరిగింది. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని హంస వాహనంపై వస్తున్న ఆంజనేయస్వామిపి దర్శనం చేసుకుని మంగళ హారతులిచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలి



డీటీసీని పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

- డీటీసీని సందర్శించిన ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: త్వరలో పోలీసు శిక్షణకు హాజరుకాబోతున్న అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. బుధవారం ఆయన డీటీసీని సందర్శించారు. డీటీసీ పరిసరాలు, మౌలిక వసతులు, బ్యారక్, ఓపెన్ జిమ్, తరగతి గదులు, పరేడ్ గ్రౌండ్‌ను పరిశీలించారు. శిక్షణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను త్వరితగతిన చేసుకోవాలని సూచించారు. డీటీసీలో చేపట్టవలసిన మరమ్మతులకు సంబంధించి అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. శిక్షణార్థులకు శారీరక శిక్షణ, పరేడ్ ప్రాక్టీస్, ఇతరత్రా ఉపయోగపడే విధంగా పరేడ్ గ్రౌండ్‌ను అభివృద్ధి చేయాలన్నారు. రన్నింగ్ ట్రాక్, డ్రిల్ ఏరియా, గార్డన్లను అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. మౌలిక వసతులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, వర్షం నీరు బయటకు పంపేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. అదనంగా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, డీటీసీ సీఐ షమీముల్లా, పీసీఆర్ ఎస్సై వేణుగోపాల్, ఆర్ఎస్సై రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.